సాక్షి పల్నాడు

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



ఘనంగా ఆత్మార్పణ దినోత్సవం

రెంటచింతల: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



భక్తుల సందడి

విజయపురిసౌత్: సాగరమాత ఆలయానికి ఆదివారం భక్తులు తరలి వచ్చారు. విచారణ గురువు బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజలో పాల్గొన్నారు.

రాజ శ్యామలాదేవిగా బండ్లమ్మ



చందోలు (పిట్టలవాని పాలెం): మాఘమాసం రెండో రోజు చందోలులోని బగళాముఖి బండ్లమ్మను ఆదివారం రాజ శ్యామలాదేవిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దూరవిద్య బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 15 వరకు అవకాశం ఉన్నట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ అధ్యయన కేంద్రం ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ రెగ్యులర్, దూరవిద్యతోపాటు డిప్లొమా, ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరేందుకు సైతం ఈనెల 15 వరకు గడువు ఉందని తెలిపారు. ఎంఏలో ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ, హిందీతోపాటు ఎమ్మెస్సీలో మ్యాథ్స్, సైకాలజీ సబ్జెక్టులు ఉన్నాయని, పూర్తి వివరాలకు అధ్యయన కేంద్రంతో పాటు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కలెక్టరేట్ స్పందన రేపటికి మార్పు

నరసరావుపేట: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

నేడు కూడా కొండవీడు ఫెస్ట్ కొనసాగింపు

కొండవీడు పర్యాటక అభివృద్ధిలో భాగంగా నిర్వహిస్తున్న కొండవీడు ఫెస్ట్-2024లో హెలీరైడ్‌ను సోమవారం కూడా కొనసాగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని కోసం బుకింగ్ చేసుకునేందుకు మహేష్‌ను 74834 32752, 94003 99999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు విద్యా,వైజ్ఞానిక ప్రదర్శన

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం ప్రకాష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 2022-23 సంవత్సరంలో అవార్డులకు ఎంపికైన 126 ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అవార్డులకు ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించిన ఒక్కొక్క విద్యార్థి బ్యాంక్ ఖాతాలలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం రూ.10వేలు జమ చేసిందని తెలిపారు. సదరు విద్యార్థులు తమ ప్రాజెక్టులతో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, గైడ్ టీచర్లకు సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్ 9032871234ను సంప్రదించాలని తెలిపారు.

సహకార సేవా కేంద్రం ప్రారంభం



బాపట్ల అర్బన్: రైతులకు అతి తక్కువ వడ్డీతో రుణాలిచ్చి వారి ఆర్థికాభివృద్ధికి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అండగా నిలుస్తోందని బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతా రామాంజనేయులు అన్నారు. బాపట్లలోని నందిరాజుతోటలో ఆదివారం బ్యాంక్ సేవా కేంద్రం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతా రామాంజనేయులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక సహకార రంగం అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. ఇప్పటికే వివిధ సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు విరివిగా రుణాలిచ్చామని, వీటితో వారి జీవన ప్రమాణాలు పెంచుకున్నారని చెప్పారు. నందిరాజుతోటలో సేవా కేంద్రం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలక వర్గ డైరెక్టర్లు, బ్యాంక్ సీఈవో, జీఎంలు, డీజీఎంలు, ఏజీఎంలు, బ్యాంకు సిబ్బంది, పీఏసీఎస్ సంఘ ప్రెసిడెంట్లు, సీఈవోలు హాజరయ్యారు. తొలుత సేవా కేంద్రానికి జీఎంగా వీవీఎస్ ఫణికుమార్ బాధ్యతలు చేపట్టారు.

శ్రీ పంచమి నాడు పంపిణీకి ఆరు వేల పెన్నుల వితరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గుంటూరు కృష్ణనగర్ బృందావన్ కాలనీకి చెందిన పద్మనాభుని జయరాం దేవస్థానానికి 6 వేల పెన్నులను విరాళంగా అందజేశారు. దాత ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు బచ్చు మాధవీకృష్ణలకు అందజేశారు. 14వ తేదీ శ్రీపంచమిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే విద్యార్థులకు ఈ పెన్నులను పంపిణీ చేయాలని దాత కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

దీర్ఘాయుష్మాన్‌భవ!

కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- గర్భిణులకు ప్రత్యేక వైద్య సదుపాయం
- అధునాతన పరికరాలతో ల్యాబ్
- 67 రకాల వైద్య పరీక్షలు
- నలుగురు వైద్యుల సేవలు



అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 2019 వరకు శిథిలావస్థలో ఉండేది. వైద్యులుండే వారు కాదు. సిబ్బంది ఇష్టారాజ్యంగా మెలిగేవారు. ఎప్పుడో ఒకసారి వచ్చి సంతకాలు పెట్టుకుని వెళ్లేవారు. ఓపీ కనీసం రెండు అంకెల్లో కూడా నమోదయ్యేది కాదు. రక్తపరీక్షలకు బయటకు పంపేవారు. జ్వరం వస్తే కనీసం పారాసెటమాల్ బిళ్ల ఇచ్చే వారు కాదు. సూది మందు వేసేందుకు దూది, సిరంజీలు కూడా బయట నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితులన్నీ మారిపోయాయి. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చింది.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి దగ్గరే వైద్యం

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వైద్య సేవల్ని విస్తరించారు. ప్రతి గ్రామానికీ వారంలో ఒకసారి డాక్టర్ స్వయంగా 104 వాహనం ద్వారా వైద్యసేవల్ని అందిస్తున్నారు. ప్రమాద సమయంలో ఫోన్ చేస్తే కుయ్..కుయ్...కుయ్ మంటూ 20నిమిషాల్లో వచ్చే విధంగా 108 వాహనాన్ని సిద్ధంగా ఉంచారు. ఇది కాక ప్రతి మంగళవారం లేదా శుక్రవారం గాని ఏదో ఒక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ద్వారా నిష్ణాతులైన వైద్యులతో సేవలను అందిస్తున్నారు. అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ వైద్యశాలలకు రిఫర్ చేస్తున్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్యం



ప్రతి నెలా 9,10 తేదీల్లో గర్భిణులకు ప్రత్యేక వైద్య సుదుపాయాల్ని ఏర్పాటుచేశారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం ద్వారా ఆశా, అంగన్‌వాడీ వర్కర్స్ ద్వారా గర్భిణుల్ని తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్‌లో వైద్యశాలకు తీసుకు వచ్చి పేర్లు నమోదు చేసుకుంటున్నారు. గర్భ నిర్ధారణ పరీక్షలతోపాటు, హిమోగ్లోబిన్, బరువు వంటి అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్తహీనతగలవారికి ఐరన్ టాబ్లెట్స్, బిడ్డ ఎదుగుదలకు కావలసిన పోషకాల్ని అందజేస్తున్నారు. అవసరమైన వారికి స్కానింగ్ నిమిత్తం ప్రభుత్వ ఖర్చుతోనే సత్తెనపల్లికి జనరల్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి పరీక్షలు చేయించి, మళ్లీ తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్‌లో జాగ్రత్తగా ఇంటి వద్దకు చేరుస్తున్నారు. గర్భవతులు పేర్లు నమోదు చేసుకుంటే రూ.5వేలు, వైద్యశాలలో ప్రసవిస్తే రూ.6వేలు, గర్భదారణ దాల్చిన వారికి జననీ సురక్ష యోజన పథకం ద్వారా పేర్లు నమోదు చేసుకుంటే రూ.5000 ఇస్తున్నారు. ప్రధాన మంత్రి వందన యోజన పథకం ద్వారా వైద్యశాలలో ప్రసవిస్తే మొదటి కాన్పుకు రూ. 6000, రెండవ కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.5వేలు ఇస్తున్నారు.

సిబ్బంది నియామకం

వైద్యశాలలో గతంలో సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉండేవి. ఉన్న సిబ్బంది కూడా రెండు మూడు రోజులకు ఒకసారి వచ్చి సంతకాలు చేసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులకు స్వస్తి పలికారు. అన్ని పోస్టులను భర్తీ చేశారు. నలుగురు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సులు, హెల్త్ ఎడ్యుకేటర్స్, హెల్త్ సూపర్ వైజర్స్, మేల్, ఫిమేల్ ఎఎన్‌ఎంలు, పీహెచ్‌సీ పరిధిలోని అన్ని సబ్ సెంటర్స్‌లోనూ సిబ్బందిని నియమించారు.

ఏడు పడకల వైద్యశాలగా రూపాంతరం

పీహెచ్‌సీని ఏడు పడకల వైద్యశాలగా రూపాంతరం చేశారు. ఇన్‌పేషెంట్స్‌కు అన్ని వసతులతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. అందులో టాయిలెట్స్, బెడ్స్, అప్పుడే పుట్టిన బిడ్డలను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు థెరపీ వంటి సౌకర్యాలున్నాయి.



గతంలో అధ్వానంగా ఉన్న పీహెచ్‌సీ భవనం

ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలు



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

రక్తపరీక్షలు చేసేందుకు ప్రభుత్వం అత్యాధునిక పరికరాలు సరఫరా చేయడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పుడు 67 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఇందుకు గాను ప్రభుత్వం సుమారు రూ.20 లక్షలు విలువ చేసే సెమీ ఆటో ఎనలైజర్, సెల్స్ కౌంటింగ్ మిషన్, ఫొటో కలోరీమీటర్, ఫ్లెమిఫొటోమీటర్, హిమోగ్లోబిన్ మీటర్‌లను సరఫరా చేసింది. వీటి ద్వారా డెంగీ, మలేరియా, గ్రూపింగ్, హెచ్ఐవీ, కొలెస్ట్రాల్, కిడ్నీ ఫంక్షనింగ్, ప్రెగ్నెన్సీ వంటి అన్ని రకాల రక్త పరీక్షలను తక్కువ సమయంలో చేయవచ్చు. వీటితోపాటు ఈసీజీ, షుగర్, బీపీ, హిమోగ్లోబిన్ టెస్టులను అందుబాటులో ఉంచారు.

24/7 సేవలు

జగన్ సర్కారు వచ్చిన తరువాత పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. వైద్య రంగంలో వినూత్న మార్పులు వచ్చాయి. నాడు-నేడు పథకం ద్వారా రూ.1.50కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేటు వైద్యశాలకు దీటుగా నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని నిర్మించారు. నలుగురు వైద్యుల్ని నియమించారు. ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, లక్షలాది రూపాయల విలువైన ఆధునిక వైద్య పరికరాల్ని సరఫరా చేశారు. ఇప్పుడు వైద్యశాలలోనే 67 రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు. సరిపడా మందులు ఉన్నాయి. కుక్క, పాము, కోతి.. ఏది కరచినా తక్షణమే చికిత్స చేసేందుకు వ్యాక్సిన్ అందుబాటులోకి తెచ్చారు. 24/7 కనిపెట్టుకుని ఉండే విధంగా స్టాఫ్ నర్సులు సిఫ్ట్ సిస్టమ్‌లో నిరతరం వైద్యసేవలు అందిస్తున్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఇన్నారావు

వైద్యసేవలు బాగున్నాయి



జనగన్న వచ్చాక వైద్యసేవలు బాగున్నాయి. తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్‌లో తీసుకు వచ్చి అన్ని పరీక్షలు చేస్తున్నారు. టాబ్లెట్స్ కూడా ఇస్తున్నారు. మళ్లీ ఇంటి దగ్గర దించుతున్నారు. పైసా కూడా ఖర్చు లేదు. కాన్పు కూడా వైద్యశాలలో పోసుకుంటా.

– ఓ. లావణ్య, గర్భిణి, చామర్రు

అందుబాటులో డాక్టర్లు



గతంలో ఎప్పుడొచ్చినా డాక్టర్లు ఉండేవారు కాదు. రక్త పరీక్షలు బయటకు రాసేవారు. ఇప్పుడు వైద్యశాలలోనే అన్ని ఉచితం గానే చేస్తున్నారు. ఎప్పుడొచ్చినా డాక్టర్లు కూడా అందుబాటులో ఉంటున్నారు. అయితే, ఒక లేడీ డాక్టరు కూడా ఉంటే బాగుంటుంది. జగనన్న సీఎం అయిన తరువాత వైద్యశాల చాలా బాగుంది. మాలాంటోళ్లకు సకాలంలో వైద్యం అందుతోంది.

– కొమరగిరి రామాంజమ్మ, గర్భిణి, చామర్రు

అందుబాటులో అన్ని మందులు



వైద్యశాలలో అన్ని మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం నలుగురు డాక్టర్లు ఉన్నారు. రెండు 104 వాహనాలున్నాయి. రెండు రూట్లుకు ఇద్దరు డాక్టర్లు ప్రతి రోజు వెళతారు. ఇద్దరు డాక్టర్లు వైద్యశాలలో ఓపీ చూస్తారు. అన్ని రకాల వ్యాక్సిన్స్ ఉన్నాయి. ప్రతి నెలా 9,10 తేదీల్లో గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు చేస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని కూడా అందిస్తున్నాం.

– డాక్టర్ ఇన్నారావు, వైద్యాధికారి, అచ్చంపేట పీహెచ్‌సీ



కొండవీడుకు మహర్దశ

- ఇక్కడి అభివృద్ధిలో భాగస్వామిని కావడం నా అదృష్టం
- ప్రతి ఒక్కరూ కొండవీడు చరిత్ర తెలుసుకోవాలి
- సీఎం వైఎస్ జగన్ చొరవతో మరింత అభివృద్ధి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- రూ.5 కోట్లతో నిర్మాణం పూర్తిచేసుకున్న రెండో దశ ఘాట్ రోడ్డు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, కలెక్టర్ శివశంకర్

యడ్లపాడు: తమ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా కొండవీడుకు మహర్దశను తీసుకొచ్చామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గిరిదుర్గం స్వాగత ద్వారం నుంచి గెస్టుహౌస్ వరకు కొండపై రూ.5 కోట్ల నిధులతో నిర్మించిన రెండో దశ ఘాట్ రోడ్డు శిలాఫలకాన్ని మంత్రి రజిని ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఆమెకు కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. మంత్రి రజిని మాట్లాడుతూ కొండవీడు కోటను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సర్వత్రా కృషి చేస్తుందన్నారు. గొప్ప వారసత్వ సంపదను భావితరాలకు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని, ఇందులో భాగంగా కొండవీడు ఉత్సవాలను ఎంతో వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కొండవీడు నేడు గొప్ప పర్యాటక ప్రాంతంగా వర్ధిల్లేందుకు ఆద్యుడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, 2005లో కొండపై ఘాట్‌రోడ్డు నిమిత్తం ఆర్అండ్‌బీ శాఖకు రూ.5 కోట్ల నిధులను ముఖ్యమంత్రి హోదాలో విడుదల చేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండవీడు కోట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. కొండవీడు-నగరవనం పేరిట ఏటా కోట్ల రూపాయల నిధులను అందించి దశలవారీగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి పనులను నిర్వహించారని మంత్రి వివరించారు.



హెలీకాప్టర్‌లో మంత్రి విడదల రజిని

2019 తర్వాతే అభివృద్ధి

కొండవీడు అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ముందు ఆ తరువాత అనే విధంగా మారిందని విడదల రజిని చెప్పారు. 2019 ముందు ఎంతో చరిత్ర గలిగిన ఈ ప్రాంతం గురించి పట్టించుకున్న నాథుడు లేడని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కొండవీడుకు కొత్త రూపు తీసుకొచ్చారని, ఈ బృహత్తర కార్యాన్ని స్థానిక ఎమ్మెల్యేగా తన చేతుల మీదుగా జరగడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎందరో సాహితి, కళాకారులను అందించిన ఈ ప్రాంతం చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కొండవీడు పర్యాటక కేంద్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నగరవనం కింద రూ.15 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ఎంతో చరిత్ర కలిగిన పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలకు జీవం పోసినట్లు అవుతుందని గుర్తించిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందని చెప్పడానికి కొండవీడు కోట అభివృద్ధి నిదర్శనమన్నారు. భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండవీడు తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కొత్తపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎంవీ సుబ్బారావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, కొండవీడు కోట అభివృద్ధి కన్వీనర్ కల్లి శివారెడ్డి, ఆర్డీఓ సరోజిని, తహసీల్దార్ మోహమ్మద్ అఫ్రపున్నిసా బేగం, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు కాట్రగడ్డ మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్నాట సుబ్బారావు పాల్గొన్నారు.

అరవిందబాబు చెప్పేవన్నీ అబద్ధాలే..

- అతనిపై ఇప్పటికే కోర్టులో పరువు నష్టం దావా వేశాం
- ఆరోపణలపై జిల్లా కలెక్టర్, తహసీల్దార్ విచారణ చేసి నివేదిక ఇచ్చారు
- అరవిందబాబు చెప్పిన భూములను చూపిస్తే అతనికే రాసిస్తాం
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



సమావేశంలో మ్యాప్ చూపిస్తూ వెంచర్‌లో భూముల గురించి చెబుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: వినుకొండ రోడ్డులోని సాయి బాలాజీ టౌన్‌షిప్ వెంచర్‌లో ప్రభుత్వ భూములు ఆక్రమించి అమ్ముకున్నట్లుగా టీడీపీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలేనని, తాము రైతుల నుంచి పట్టా భూమి కొనుగోలుచేసి వెంచర్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆరోపణల్ని ఖండించారు. మ్యాప్‌ల ఆధారంగా అరవిందబాబు చూపించిన సర్వే నంబర్లు, వెంచర్ ఉన్న సర్వే నంబర్లలో ఉన్న తేడాల్ని సోదాహరణంగా వివరించారు. గతంలో ఇదే భూమిపై తనపై చేసిన ఆరోపణలకు లీగల్ నోటీసులు ఇచ్చి కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశామని తెలిపారు. అతనికి టౌన్‌షిప్ ఏ సర్వే నంబర్లలో ఉందో కూడా తెలియదని విమర్శించారు. అతను చెప్పిన 175 నుంచి 196 సర్వే నంబర్ల భూమిలో సాయిబాలాజీ టౌన్‌షిప్ లేదని చెప్పారు. భూములున్న మ్యాప్‌ను ఎమ్మెల్యే చూపించారు.

అన్నీ అవాస్తవాలు

నరసరావుపేట నుంచి వినుకొండ వెళ్లే మార్గంలో 183, 184, 185, 187, 198, 199, 200, 201, 202, 203, 205, 206, సర్వే నంబర్లలో టౌన్‌షిప్ ఉందని వివరించారు. ఏఎంరెడ్డి కళాశాల కాలువ రోడ్డు దగ్గర నుంచి వెంచర్ ఉన్నట్లుగా సమావేశంలో విలేకర్లకు చూపించాడన్నారు. 189 సర్వేలో బండిదారి డొంక 3.5ఎకరాలు ఆక్రమించినట్లు చెప్పాడని, ఇప్పటికీ అది ఉందని స్పష్టం చేశారు. 192-ఏలో చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయానికి చెందిన 3.72 ఎకరాల భూమి ఆక్రమించారని చెప్పాడని, వాస్తవానికి అది పుష్పగిరి పీఠం స్వాముల వారీ భూమి అని వివరించారు. నలుగురు రైతులు తిరుమల సీతారామిరెడ్డి, కలుమూరి మంగమ్మ, యాదల రమేష్‌రెడ్డి, యాదల శ్రీనివాసరెడ్డి ఇప్పటికీ సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే తహసీల్దార్, జిల్లా కలెక్టర్ విచారణ చేసి నివేదిక తయారుచేశారని, దాన్ని పరిశీలించాలని సూచించారు. కుమ్మరి, వడ్రంగి, ఇనాములకు చెందిన 16.4ఎకరాల గురించి చెప్పాడని, అవి ఏ సర్వే నంబరులో ఉన్నాయో చెప్పలేదన్నారు. వారెవరో కూడా ఎవరికీ తెలియదన్నారు. వెంచర్ ఉన్న 184, 188, 195, 196, 197 సర్వే నంబర్లలోని పట్టాభూమి షేక్ ఖాజావలి మాష్టారు వద్ద నుంచి కొనుగోలు చేశామని గోపిరెడ్డి వివరించారు. 187 సర్వే నంబర్‌లోని భూమి యన్నం సత్యనారాయణరెడ్డి, కాసా ముత్తయ్య, 190 కనకా రామిరెడ్డి, మిగిలిన 201, 200, 202, 203, గుంటూరుకు చెందిన డాక్టర్ కామరాజు అనీల్ కుమార్ వద్ద నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. అరవిందబాబు చెప్పిన 175, 176 సర్వే నంబర్ల భూమి శనివారపు శివారెడ్డి, శేషమ్మలది అంటూ పాస్‌బుక్ చూపించారు. 181 హాలీవుడ్ రఘు, 182, 185, 186 ఉప్పలపాడుకు చెందిన యన్నం నరసింహారెడ్డికి చెందినవి వివరించారు.

అబద్ధాలతో రాజకీయం

191 నుంచి 194వరకు భూములు వెంచర్‌కు సంబంధం లేనివని గోపిరెడ్డి తెలిపారు. ఎవరివో కూడా తమకు తెలియదన్నారు. నిత్యం అబద్ధాలు చెప్పి రాజకీయం చేయాలని చూస్తున్నాడని, ప్రజలకు తర్వాతైనా తెలుస్తుందన్నారు. వెంచర్‌పై వచ్చిన ఆరోపణలకు జిల్లా కలెక్టర్ విచారణ చేయించారన్నారు. వెంచర్‌లో ప్రభుత్వ భూమి డీకే పట్టాగా 1939లో ఇచ్చారని, దీనిని రెగ్యులైజేషన్ చేసుకోవచ్చని తెలిపారన్నారు. అయినప్పటికీ దీనిలో ప్లాట్లు వేయకుండా ఓపెన్ ఏరియాగా ఉంచామని ఎమ్మెల్యే వెల్లడించారు. అతను చెప్పిన మిగులు భూమి 14.6, వడ్రంగి, కుమ్మరి, ఇనాము భూములు 16.47ఎకరాలు కలిపి సుమారుగా 30ఎకరాలు ఉన్నాయని, వాటిని అతను వచ్చి చూపిస్తే రాసిస్తానని ఓపెన్ ఛాలెంజ్ చేశారు. గతంలో తనపై విజయవాడ భూములు, కేసానుపల్లి భూములపై ఆరోపణలు చేశాడన్నారు. భూములు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియకుండా పిచ్చి పిచ్చి ఆరోపణలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. దీన్ని బట్టి అరవిందబాబు కాకుండా అరబందపుబాబు అని ఎందుకు పిలవకూడదని ప్రశ్నించారు. ఆరోపణలు చేసేముందు భూముల గురించి ప్రభుత్వ అధికారుల నుంచి ఎటువంటి సర్టిఫికెట్ తీసుకోలేదని విమర్శించారు. ఇందులోని వాస్తవాలు అందరూ తెలుసుకోవాలని గోపిరెడ్డి కోరారు. ఒక అభద్రతా భావంతో వ్యవహరిస్తూ గెలవకుండానే అరవిందబాబు ఎమ్మెల్యేనని చెప్పుకుంటున్నాడని ఎద్దేవా చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

- ఆరంభమైన మాఘమాస సందడి
- సర్వ దర్శనానికి రెండున్నర గంటలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు విశేషంగా తరలివచ్చారు. మాఘ మాసం ప్రారంభం కావడంతో శుభకార్యాలు, నిశ్చయ తాంబూలాలకు హాజరయ్యేందుకు నగరానికి విచ్చేసిన వారు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో రద్దీ కనిపించింది. మరో వైపున తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేయడం కనిపించింది. తెల్లవారుజాము నుంచే పెద్దఎత్తున ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల వాహనాలతో ఘాట్‌రోడ్డు ఉదయం 9 గంటలకే కిటకిటలాడింది. సీతమ్మ వారి పాదాలు, హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర పార్కింగ్ చేసుకుని దేవస్థాన బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ. 100, రూ. 300, రూ.500 టికెటు క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. మరో వైపున మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయగా, రద్దీ మరింత పెరిగింది. సర్వ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఈఈ కోటేశ్వరరావు, ఏఈవోలు రమేష్‌బాబు, చంద్రశేఖర్ క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవ, పల్లకీ సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 517.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 819.40 అడుగుల వద్ద ఉంది.

క్లుప్తంగా

సీఎం సభాస్థలి, గ్యాలరీల నిర్మాణ పనుల పరిశీలన



ఫిరంగిపురం: మండల కేంద్రంలో ఈనెల 15న నిర్వహించనున్న 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి రానున్నారు. కాగా సభాస్థలి, గ్యాలరీల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ మండలి సభ్యుడు తలశిల రఘురామ్, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎస్పీ తుషార్ డూడీలు ఆదివారం పరిశీలించారు. హెలీప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు, బ్యారికేడ్లు ప్రదేశాలలో చేపట్టాల్సిన పనులపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో జేసీ రాజకుమారి, ఆర్డీవో పి.శేఖర్, ఆర్అండ్‌బీ అధికారులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎంపిక



తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ స్పెషల్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం మంగళగిరి ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మద్ది ప్రభాకర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి రాష్ట్రంలోనే గుంటూరు జిల్లాను ప్రత్యేక స్థానంలో నిలిపేందుకు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గుమ్మడి కోటేశ్వరరావు చేసిన సేవలు మరువలేనిదని అన్నారు. అనంతరం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా ఆర్.ఎస్. వంశీకృష్ణ, అధ్యక్షులుగా కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా యస్.కె. సంధాని, ట్రెజరర్‌గా గుమ్మడి వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మద్ది ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు గంట వెంకటేశ్వరరావు, సౌత్ జోన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ దినేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం.. పరవశం

- కొండవీడు ఫెస్ట్..గ్రాండ్ సక్సెస్
- ముగిసిన ఉత్సవాలు
- రెండోరోజు పోటెత్తిన సందర్శకులు
- సమన్వయంతో సదుపాయాలు కల్పించిన యంత్రాంగం
- సందర్శకుల్లో సంతృప్తి



ఫెస్ట్‌లో పాల్గొన్న మంత్రి విడదల రజిని, పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

యడ్లపాడు: ఘన చరిత్రను నేటి తరానికి తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొండవీడు ఫెస్ట్–2024 దిగ్విజయంగా ముగిసింది. శని, ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించిన ఉత్సవాలకు తొలి రోజుకు మించి రెండో రోజైన ఆదివారం సుమారు 50 వేల మంది సందర్శకులతో పర్యాటక ప్రాంతం పరవశించింది. వారసత్వ సంపద పరిరక్షణ ప్రచార నిమిత్తం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర పండుగ సూపర్ సక్సెస్ అయింది. జిల్లావాసులతో పాటు సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, సందర్శకులు భారీగా తరలివచ్చారు. కొండవీడు కోట సమీప ప్రాంతాలు సందర్శకుల రాకపోకలతో సందడి నెలకొంది. కొండ కింద పైన ఎటుచూసినా జనసమూహంతో నిండిపోయింది. పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువతలో కొత్త ఉత్సాహం, మహిళలు, పెద్దల్లో కొత్త అనుభూతిని ఉత్సవాలు నింపాయి. ఫుడ్‌కోర్టులు ఉత్తరాంధ్ర కొత్త రుచులను, సంప్రదాయ వంటకాలను సందర్శకులకు అందించాయి.

సందర్శకుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

చిలకలూరిపేట ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో గతంలో సొలస–ఫిరంగిపురం సర్వీసు మాత్రమే ఉండగా ఉత్సవాల సందర్భంగా బోయపాలెం మీదుగా కొండవీడుకు ప్రత్యేక సర్వీసుల్ని నడిపారు. పుట్టకోటలో తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాటు చేసి కొండపైకి తరలించేందుకు అదనపు సర్వీసుల్ని ఏర్పాటు చేశారు.

నిరంతరాయంగా సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాలు రెండు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు వసంతరాజీయం వేదికపై నిర్విరామంగా కొనసాగాయి. క్లాసికల్, వెస్టర్న్ డాన్సులు, కొండవీడు ఖ్యాతిని కీర్తిస్తూ నాటి కవుల పద్యరాగాలు, చారిత్రక వివరాలు, విశ్లేషణ, మిమిక్రీ, సంగీత, వాయిద్య, నాటికలు వంటి కార్యక్రమాలు ఆహూతుల్ని ఎంతో ఆకట్టుకున్నాయి. టాలీవుడ్ గాయని సమీరా భరద్వాజ్, మురళి సినీ గీతాల్ని ఆలపించారు. జబర్దస్త్ టీం రైజింగ్ రాజు, తన్మయి, రాజమౌళి, శాంతికుమార్, కామెడీ షో కడుపుబ్బ నవ్వించింది. జనవిజ్ఞాన వేదిక సాంస్కృతిక సభ్యులు సైన్స్ ఆవశ్యకతపై అభ్యుదయ గీతాలు, నృత్యాలు, నాటికలు ప్రదర్శించారు. చిలకలూరిపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.వి.నాగలక్ష్మి యాంకర్‌గా వ్యవహరించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి బహుమతులను అందజేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ బాణాసంచ కాలుస్తూ ప్రదర్శించిన లేజర్ షో హైలెట్‌గా నిలిచాయి.



చిన్నారులతో నిండిన చిల్డ్రన్స్ పార్కు



వెదుళ్ల చెరువు వద్ద బోటింగ్ షికారు

సమన్వయంతో సక్సెస్

జిల్లాకు చెందిన వివిధ శాఖల సమన్వయంతో కొండవీడు ఉత్సవాలు విజయవంతం అయ్యాయి. సాంస్కృతిక కార్యక్రమాల్ని డ్వామా పీడీ జి. జోసఫ్‌కుమార్, డీఈఓ వెంకటేశ్వర్లు, ఫుడ్‌కోర్టులను పొడ వైస్ చైర్మన్ జి. శ్రీనివాసరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, హెలిరైడ్‌ను ఆర్ అండ్ బీ ఎస్ఈ రాజానాయక్, శాండ్ ఆర్ట్ మైక్రో ఇరిగేషన్‌ను పి.డి. ఆంజనేయులు, ఫ్లవర్ షో విభాగాన్ని టూరిజం, ఉద్యాన శాఖ అధికారి బి.జె.బెన్నీ, ఫొటో ఎగ్జిబిషన్‌ను డీఈఓ వెంకటేశ్వర్లు, హార్స్ రైడింగ్ స్కిల్స్‌ను డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావు, బోటింగ్ ప్రక్రియను మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సంజీవరావు, చిన్నారుల క్రీడా ప్రాంగణాన్ని వ్యవసాయ శాఖ పీడీ మురళి, పారిశుద్ధ్య విభాగం డీపీఓ భాస్కరరెడ్డి, తాగునీటి సరఫరాను ఆర్‌డబ్ల్యూఎస్ సురేష్, అడ్వెంచర్స్ విభాగాన్ని డీఎఫ్ఓ ఎస్. రామచంద్రారావు, విద్యుత్ విభాగాన్ని ట్రాన్స్‌కో ఈఈ సురేష్, రక్షణ విభాగాన్ని ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి, వైద్య శిబిరాలను డీఎంహెచ్ఓ రవి పర్యవేక్షించారు.

రెండో రోజు ఉత్సవాలకు మంత్రి రజిని

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పార్టీ శ్రేణులతో కలిసి కొండవీడు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కొండపై ఏర్పాటు చేసిన వైద్య శిబిరంతో పాటు అన్ని స్టాల్స్‌ను ఆమె సందర్శించి హెలిరైడ్, బోటింగ్ నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు కుటుంబ సమేతంగా రాగా, ఎలక్షన్స్ కమిషనర్ సహాయ కార్యదర్శి కోటేశ్వరరావు, ఏపీ ఎలక్ట్రికల్స్(విజిలెన్స్) విభాగం జీఎండీ బి. మల్లారెడ్డి సందర్శించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, డీఎఫ్ఓ ఎన్ రామచంద్రారావు, కల్లి శివారెడ్డి, ఇతర జిల్లా అధికారులు వారిని సాదరంగా ఆహ్వానించారు.

నేడూ హెలిరైడ్

యడ్లపాడు: పల్నాడు జిల్లా కొండవీడు కోట పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన కొండవీడు ఫెస్ట్–2024లో హెలిరైడ్‌ను సోమవారం కూడా సందర్శకుల కోసం కొనసాగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. హెలిరైడ్‌కు సంబంధించి బుకింగ్ చేసుకునేవారు ఆర్గనైజర్ మహేష్ సెల్‌నం:7483432752, 94003 99999లను సంప్రదించాలని కోరారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా



రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలతో జేవీవీ ప్రతినిధులు

యడ్లపాడు: మనిషి విడగొట్టే మతాలు ముఖ్యంకాదు.. డీఎన్ఏలను ప్రకారంగా గమనిస్తే మానవులంతా ఒకటేనని శాస్త్రీయంగా నిర్ధారణ అవుతుందని నెల్లూరు ప్రభుత్వ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా సాహెబ్ పేర్కొన్నారు. చెకుముకి 34వ సైన్స్ సంబరాలు యడ్లపాడు నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఆదివారం నిర్వహించారు. హూ ఐయాం ఐ అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. రాష్ట్రస్థాయి క్విజ్ తదితర పోటీల్లో 48 విద్యార్థి బృందాలు పాల్గొన్నాయి. ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. సైన్స్ సంబరాల్లో విజ్ఞాన యాత్రల్లో భాగంగా కొండవీడు ఫెస్ట్– 2024 ఉత్సవాలకు ఐదు బస్సుల్లో తీసుకువెళ్లారు. చారిత్రక ప్రాంతం విశిష్టత, నాటి రాజుల పాలనా వైభవంపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించి, వసంతరాజీయం వేదికపై అభ్యుదయ గీతాలు, నృత్యాలు, రూపకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో జేవీవీ పల్నాడుజిల్లా అధ్యక్షులు డాక్టర్ దార్ల బుజ్జిబాబు, కార్యదర్శి సీహెచ్ జయప్రకాష్ చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు సీహెచ్ సృజన, ఎం.వెంకటేశ్వరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జేవీవీ ఆల్ ఇండియా సైన్స్ పీపుల్స్ నెట్‌వర్క్ సభ్యులు కె.శ్రీనివాస్, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకర్రావు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు



మాదలలో అయ్యప్పను అభినందిస్తున్న జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

మాదల(ముప్పాళ్ల): రైతులకు సహకారం సంఘం ద్వారా అందించే సేవలు మరింతగా మెరుగుపరచి సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని మాదల సహకారం సంఘం చైర్‌పర్సన్‌గా మాదల గ్రామానికి చెందిన తిరుమలశెట్టి అయ్యప్ప ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాదలలోని సహకారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. వ్యవసాయానికి అవసరమైన పంట రుణాలు, రైతు భరోసా సాయంతో పాటుగా సబ్సిడీపై వ్యవసాయ యంత్రపరికరాలు అందిస్తోందని వివరించారు. పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాములు నిర్మాణాలు చేపట్టడం జరిగిందని చెప్పారు. సంఘాలు బలోపేతంగా చేసే దిశగా నూతన కమిటీ పనిచేయాలని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులను అభినందించారు. డైరెక్టర్లుగా బొల్లవరం గ్రామానికి చెందిన కంది రామిరెడ్డి, ఇరుకుపాలేనికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లులతో సొసైటీ కార్యదర్శి సుంకర శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచి సైదా, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, పార్టీ నాయకులు కె.పుల్లారెడ్డి, సీహెచ్ శ్రీనివాసరావు, నాగిరెడ్డి, డి.బుజ్జి, టి.రామారావు, సొసైటీ మాజీ చైర్‌పర్సన్ వెంకటరెడ్డి, ముప్పాళ్ల సొసైటీ చైర్‌పర్సన్ అన్నపురెడ్డి సాయిరెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. మండలంలోని కారుమంచిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నిర్మించిన గోదాము ప్రారంభం, రూ.80 లక్షలతో నిర్మించనున్న పెట్రోలు బంకు పనులకు భూమి పూజ ఆదివారం చేశారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ మండలంలో రైతుల పండించిన పంటలు నిల్వ ఉంచటానికి కొత్తలూరు–500 టన్నులు, వేల్పూరు–1000 టన్నులు, మతుకుమల్లి 500 టన్నులు. గుంటుపాలెం 500 టన్నులు గోదాములను ప్రభుత్వం మంజూరు చేయటం అభినందనీయమన్నారు. కారుమంచి గ్రామంలో 11 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 50 సెంట్లు స్థలంలో గోదాము నిర్మాణ పనులు చేపట్టటంతో పాటు వర్మీకంపోస్టు ఎరువు తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి మల్లావరపు విశ్రాంతం, ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్లు బొల్లా వెంకట సాంబశివరావు, నాగులపాటి చెన్నయ్య, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, మాజీ ఎంపీపీ గుత్తా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు బాబూరావు, వైఎస్సార్ సీపీ నేతలు జి.సూర్యనారాయణ, బి.శ్రీనివాసరావు, కె.వీరాస్వామి, ఈ.హనుమంతరావు, వి.సుబ్బారావు, వినుకొండ సొసైటీ బ్యాంకు మేనేజరు దేవరశెట్టి నాగకిషోరు, సీఈఓలు వైవీ నారాయణ, జాలాది నాగప్రసాద్, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు, వీఆర్వో దూపాటి దేవమ్మ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఆదుకునే వారికే మద్దతు పలుకుదాం

రాజేష్ నాయుడుకు ప్లంబర్స్ యూనియన్ సభ్యుల మద్దతు



రాజేష్‌నాయుడును పీవీసీ పైపు ముక్కల గజమాలతో సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

చిలకలూరిపేట: ఆపద సమయంలో ఆదుకొనే... కష్టకాలంలో వెన్నంటి నిలిచే మంచి మనిషి మల్లెల రాజేష్‌నాయుడుకు అండగా నిలుద్దామని శ్రీ గంగా భవాని ప్లంబర్స్ యూనియన్ సభ్యులు తీర్మానించారు. ప్లంబర్స్ యూనియన్ సభ్యులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడుకు మద్దతు తెలుపుతూ ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకొని అక్కడ రాజేష్‌నాయుడుకు పీవీసీ పైపు ముక్కలతో కూడిన గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మల్లెల రాజేష్‌నాయుడు ఎప్పటి నుంచో ప్లంబర్స్ యూనియన్ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో ఓ ప్లంబర్ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైతే రూ.70 వేలు ఆర్థిక సహాయం అందించి అతడి ప్రాణాలు నిలబెట్టారని కొనియాడారు. అదే విధంగా ఎంతో మంది ప్లంబర్లకు ఎన్నో రకాలుగా సహాయం అందించారని వివరించారు. అలాంటి వ్యక్తికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు చందు బసవయ్య, అధ్యక్షులు ఎస్.పిచ్చేశ్వరరావు, ఉపాధ్యక్షులు దావూద్ నూర్, ప్రధాన కార్యదర్శి కె శంకరరావు, సంయుక్త కార్యదర్శి ప్రతాప్‌సింగ్, కోశాధికారి కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్నాడు ప్రజలకు అందుబాటులో సేవా కేంద్రం


జీడీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి



నరసరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకంలో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకును దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపినట్లు బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) అన్నారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లోని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆవరణలో ఆదివారం ఆయన పల్నాడు జిల్లా సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సేవా కేంద్రంలో జీఎంతో పాటు ముగ్గురు ఏజీఎంలు, చీఫ్ మేనేజర్‌లు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. సేవా కేంద్రం ప్రారంభంతో ఇక నుంచి పల్నాడు జిల్లా ప్రజలు సొసైటీల చైర్‌పర్సన్‌లు, సీఈఓలు బ్యాంకు అధికారులు గుంటూరు ఏడీఎం ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదని చెప్పారు. బ్యాంకు అధికారులు, సొసైటీల సిబ్బంది, చైర్ పర్సన్‌ల సమష్టి కృషితోనే బ్యాంకును రూ.6 వేల కోట్ల టర్నోవర్‌కు చేర్చినట్లు వెల్లడించారు. 2.59 లక్షల సమైఖ్య ఖాతాలను మూడు నెలల వ్యవధిలో ప్రారంభించి దేశంలోనే బ్యాంకు మొదటి స్థానంలో ఉందన్నారు. రూ.600 కోట్ల మేర స్వయం సహాయ గ్రూప్‌లకు రుణాలు అందించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర బ్యాంకర్స్ సమావేశంలో సహకార బ్యాంకులు మా వ్యాపారాలు అడ్డు వస్తున్నాయని జాతీయ బ్యాంకుల వారు మాట్లాడితే సహకార బ్యాంకులు మా బ్యాంకులని ముఖ్యమంత్రి మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం మన రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి సొసైటీలను కంప్యూటరీకరణ చేస్తుందన్నారు. బ్యాంకు పురోభివృద్ధిలో సమైఖ్య ఖాతాలను ప్రారంభించటంలో ముందున్న వారందరికీ త్వరలో ప్రోత్సాహకాలను అందజేస్తామన్నారు. సమావేశానికి బ్యాంకు డైరెక్టర్ కోటా హరిబాబు అధ్యక్షత వహించారు. బ్యాంకు సీఈఓ టి.కృష్ణవేణి, డైరెక్టర్లు వట్టికొండ కోటేశ్వరమ్మ ఆంజనేయులు, వెలిశల ఏడుకొండలు, మూడావత్ గోవిందానాయక్, ప్రొఫెషనల్ డైరెక్టర్ కె.శివ నవీన్, జీఎంలు చింతల అజేయ్ కిషోర్ కుమార్, వి.వి.ఎస్. ఫణి కుమార్, కె.మాధవి, డీజీఎం కె.శ్రీనివాస్, ఏజీఎంలు బత్తుల బాలకృష్ణారెడ్డి, బి.సుబ్బారావు, బాలాజీ నాయక్, చీఫ్ మేనేజర్‌లు ఎస్.రమాదేవి, మందాల కోటిరెడ్డి, కిషోర్, రఫి, ఫ్యాక్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పొలిమేర వెంకటరెడ్డి, మేనేజర్లు మిరియాల కోటేశ్వరరావు, ప్రభాకర్, శివారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఏఎంలు ఎస్. వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వామినాథన్ సేవలు అజరామరం

ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి



గుంటూరు రూరల్: ఊపిరి ఉన్నంత వరకు వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి దేశాన్ని ఆహార సంక్షోభం నుంచి స్వయం సమృద్ధి సాధించే దిశగా నడిపించిన హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది మన్ననలు పొందిన భారతదేశ హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్ర నిపుణుడు ఆయనని చెప్పారు. ఆయన చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ఆయన మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని ఇచ్చి సత్కరించటం సంతోషకరమన్నారు. ఆయన వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి చేసిన సేవలను అభివర్ణించారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు అధిపతిగా, కేంద్ర వ్యవసాయ ప్రధాన కార్యదర్శిగా, రైతుల ఆత్మహత్యల కోసం ఏర్పడిన జాతీయ కమిషన్ చైర్మన్ లాంటి ఎన్నో పదవులలో పనిచేశారన్నారు. పద్మశ్రీ,, రామన్ మెగాసేసే, పద్మభూషణ్, పద్మ విభూషణ్, వరల్డ్ ఫుడ్ ప్రైజ్, ఇందిరాగాంధీ శాంతి బహుమతి, ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం లాంటి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను ఆయన అందుకున్నారన్నారు.

మార్కెట్ కమిటీల్లో మెరుగైన పన్ను వసూళ్లు

- టార్గెట్ రూ.119.95 కోట్లు..
- జనవరి చివరి నాటికి రూ.103.85 కోట్లు వసూలు
- మార్కెటింగ్‌శాఖ ఏడీ బి.రాజబాబు

కొరిటెపాడు(గుంటూరు): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గుంటూరు జిల్లాలో మార్కెట్ కమిటీల పన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నట్లు మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు ఆదివారం 'సాక్షి'కి తెలిపారు. జిల్లాలో 8 మార్కెట్ కమిటీలకు 2023–24 ఆర్థిక సంవత్సరం రూ.119.95 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యాన్ని నిర్దేశించగా.. అందులో అత్యధికంగా గుంటూరు మార్కెట్ యార్డుకు రూ.93 కోట్లు, పొన్నూరుకు రూ.6.92 కోట్లు, తెనాలికి రూ.6.20 కోట్లు, అత్యల్పంగా ఫిరంగిపురానికి రూ.1.80 కోట్లు ఇచ్చామన్నారు. మిగిలిన వాటిలో ప్రత్తిపాడుకు రూ.3.40 కోట్లు, మంగళగిరికి రూ.3.30 కోట్లు, దుగ్గిరాలకు రూ.3.23 కోట్లు, తాడికొండకు రూ.2.10 కోట్ల వసూలు లక్ష్యంగా నిర్దేశన చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో జనవరి చివరి నాటికిగానూ రూ.86.57 శాతం పురోగతితో రూ.103.85 కోట్లు వసూలైందన్నారు. గత ఏడాది ఇదే సమయానికి రూ.94.90 కోట్లు వసూలు కాగా ఈసారి రూ.8.95 కోట్లు పెరిందన్నారు. ఈ లెక్కన ఈ ఏడాది వంద శాతానికి మించి వసూళ్లు జరిగేలా విజిలెన్స్ చర్యలు మరింత పటిష్టం చేశామని తెలిపారు. మొత్తం మీద చూస్తే.. ప్రస్తుతం పన్ను వసూళ్లలో గుంటూరు మార్కెట్ యార్డు ప్రథమ స్థానంలో ఉండగా, ఆ తర్వాత పొన్నూరు, తెనాలి, ప్రత్తిపాడు, మంగళగిరి, దుగ్గిరాల కమిటీలు నిలిచాయన్నారు. తాడికొండ, ఫిరంగిపురం కమిటీలు చాలా వెనుకబడినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



అఖిల్‌రాజ్ (ఫైల్)

బొల్లాపల్లి: బైక్‌ని ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం అక్కపాలేనికి చెందిన బందెల పేతురు, మరియమ్మ రెండో కుమారుడు అఖిల్‌రాజ్(17) వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు కూలీ పనుల నిమిత్తం కర్నూలు జిల్లాలోని ఆత్మకూరు ప్రాంతానికి వెళ్లారు. రెండు రోజులు సెలవులు కావడంతో అఖిల్‌రాజ్ నాయనమ్మ, తాతయ్యల స్వగ్రామమైన మండలంలోని గంగుపల్లికి వచ్చాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతిచెందాడు. సమాచారం మేరకు బండ్లమోటు ఎస్ఐ డి.చెన్నకేశవులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి అన్న అలేఖ్యాబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.